నిరాశాజనకంగా మామిడి కాపు

- ముంచిన ప్రతికూల వాతావరణం
- అంతంత మాత్రంగానే దిగుబడి
- ధర పతనంతో రైతులు ఢీలా

ఈ ఏడాది మామిడి సీజన్‌లో కాపు అంతంత మాత్రమే ఉండడంతో ధర కాస్తా ఎక్కువగానే ఉంటుందని మామిడి రైతులు ఆశపడ్డారు. కానీ దిగుబడులు తక్కువగా ఉండి ధర కూడా ఆశించిన మేరకు పెరగలేదు. దీనికి తోడు వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో రైతన్నలు కుదేలవుతున్నారు.


కల్లూరులోని మామిడి తోట

కల్లూరు: సత్తుపల్లి నియోజకవర్గంలో సత్తుపల్లి, కల్లూరు, వేంసూరు, పెనుబల్లి, తల్లాడ మండలాల్లో దాదాపు 21,685 వేల ఎకరాలలో మామిడి తోటలు ఉన్నాయి. కల్లూరు మండలంలో 4 వేల ఎకరాలలో మామిడి సాగు చేస్తున్నారు. ఇక్కడ బంగినపల్లి, తోతాపురం, చిన్న, పెద్ద రసాలు రైతులు ఎక్కువగా సాగు చేస్తారు. అయితే మామిడి రైతులు పూత వచ్చిన దగ్గర నుంచి కాయలు మార్కెటింగ్ చేసే వరకు జాగ్రత్తగా చూసుకుంటూ తెగుళ్లు, చీడ పీడలు రాకుండా సస్యరక్షణ చర్యలు తీసుకుంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటేనే రైతులకు ఆదాయం వస్తుంది. గత ఏడాది మామిడి కాయ కాపు ఆశా జనకంగా ఉన్నప్పటికీ ధర మాత్రం టన్ను రూ.15 వేల నుంచి రూ. 25 వేల వరకు పలికింది.

తామర ఉధృతితో మాడిన పూత..

ఈ సంవత్సరం గత ఏడాదికంటే దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. పూతలు ఒక మోస్తరుగా వచ్చినప్పటికీ చీడ పీడలు ఉధృతి కారణంగా పూతంతా మాడిపోయింది. ముదురు వచ్చిన పూత, ఆఖరులో వచ్చిన పూత కొంత మేరకు నిలిచి పిందెలు ఏర్పడ్డాయి.

దెబ్బతీసిన ప్రతికూల వాతావరణం..

అయితే ఇటీవల కురిసిన వర్షాలకు మామిడి రైతులకు తీరని నష్టం మిగిల్చింది. దీనికి తోడు ఈదురు గాలులు తోడవ్వడంతో పలు మండలాల్లో మామిడి కాయలు నేలపాలయ్యాయి. ఈ వర్షాల కారణంగా మామిడికి తెగుళ్లు ఉధృతంగా ఆశించింది. దీంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

పెరిగిన పెట్టుబడులు..

ఏడాదికేడాదికి మామిడికి పెట్టుబడులు పెరుగుతూనే ఉన్నాయి. దిగుబడి తగ్గడం, దానితో పాటు ధరలు కూడా పతనమవుతుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ట్రాక్టర్లుతో దుక్కిదున్ని, పురుగుమందులు, కోతకూలి, ట్రాన్స్‌పోర్ట్ కిరాయిలు అన్నీ కలిపితే పెట్టుబడి తడిసి మోపడవుతుంది. కానీ మామిడి కాయలకు ధర మాత్రం పెరగడం లేదు. ఒక్కొక్క తోటకు 10 సార్లకు పైగా పురుగు మందులు పిచికారీ చేశారు. పెట్టుబడి పెరిగి దిగుబడి రాకపోవడం, వచ్చిన దిగుబడులకు ధర లేక పోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

రూ.15 లక్షలు పెట్టుబడి పెట్టా..



నేను కల్లూరు మండలంలో సుమారు 100 ఎకరాలకు పైగానే మామడి తోటలు కౌలుకు తీసుకున్నాను. బంగినపల్లి, తోతాపురి రకం మామిడి సాగు చేస్తున్నా. దీనికి రూ.15 లక్షలు పైగానే పెట్టుబడి పెట్టా. అయితే దిగుబడి అంతంతమాత్రంగానే ఉంది. ధర కూడా ఆశించినంతగా లేదు.

– సయ్యద్ నబి, మామిడి కౌలు రైతు, కల్లూరు

సంక్షేమంలో తెలంగాణ నంబర్ వన్

- వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్
- కల్యాణలక్ష్మి, షాదీ ముభారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ


చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే రాములు నాయక్, డీసీసీబీ చైర్మన్ నాగభూషణం

కారేపల్లి: సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్ అని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. బుధవారం కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సింగరేణి తహసీల్దార్ తూమాటి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముభారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీతో పాటు, పేదలకు ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ పట్టాలను డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణంతో పాటు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదింటి యువతులకు సీఎం కేసీఆర్ మేన మామలా కల్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కులను అందిస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ దావఖానల్లో చికిత్స చేయించుకున్న వారికి అండగా ఉండి సీఎం ఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్నారని తెలిపారు. ప్రోటో కాల్ ఉన్న నాయకులు పార్టీ కార్యక్రమాలకు, అధికార కార్యక్రమాలకు హాజరుకావటం లేదని, వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని, ఎంపీపీ, జెడ్పీటీసీలు హాజరు కాకపోవటంతో అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, ముత్యాల సత్యనారాయణ, తోటకూరి పిచ్చయ్య, సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు, ధరావత్ మంగీలాల్, అడ్డగోడ ఐలయ్య, అజ్మీర వీరన్న, మాజీ ఎంపీపీ పద్మావతి, ఈసాల నాగేశ్వరరావు, భూక్యా రంగారావు, కుర్సం సత్యనారాయణ, పిల్లి వెంకటేశ్వర్లు, జూపల్లి రాము, గౌస్‌పాషా, బత్తుల శ్రీనివాసరావు, ఇస్లావత్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం


రేమిడిచర్లలో కరపత్రాలు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో బుధవారం రాత్రి హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాయకులు కోటపాటి రంగారావు, నాగిరెడ్డి శ్రీనివాసరావులు మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, పేదలను ఆదుకుంటుందని చెప్పారు. అధికారంలోకి రాగానే ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంచర్ల వెంకటనర్సయ్య, పిల్లి బోస్, కోటపాటి పూర్ణ, ఆశీర్వాదం, రావూరి నాగబాబు, తదితరులున్నారు.

హనుమాన్ మాలధారణ

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీమెట్టాంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం భక్తులు హనుమాన్ మాలధారణ దీక్షలు చేపట్టారు. ఈ నెల 13న పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించబడుతుందని, 14న హనుమాన్ జయంత్రి వేడుకలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ మానుకోట సత్యనారాయణ (మధు), చీపు సురేష్, సాధు శివ తెలిపారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న సమితి బాధ్యులు

తల్లాడ: తల్లాడకు చెందిన షేక్ జానీ కుమారుడు నహీం కిడ్నీలో రాళ్లు రావడం, కామెర్ల వ్యాధి సోకడంతో అనారోగ్యానికి గురయ్యాడు. నిరుపేద కటుంబం కావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ముస్లిం సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం రూ.35,000 వితరణగా అందజేశారు. వైద్యానికి ఈ డబ్బు సరిపోవడం లేదని ఎవరైన ఉదార స్వభావులు 95502-07789, 83175-83440 ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా నగదును అందించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్నా, మెహరాజ్, నిజాం, బాబా, అల్తాఫ్, యాకూబ్, పాషా, జునేద్, మైబెల్లీ, షేక్ సైదా పాల్గొన్నారు.

6న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

కల్లూరు: కల్లూరులోని కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ కాలనీ ఆవరణలో కొలువైన శ్రీ భూనీశా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఈ నెల 6వ తేదీన రాత్రి 7.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ బాధ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కల్యాణోత్సవం సందర్భంగా 4వ తేదీ నుంచి ప్రత్యేక పూజలు మొదలవుతాయని, 5న ధ్వజారోహణం, 6న స్వామివారి ఎదుర్కోలు, కల్యాణోత్సవం, 7న గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు ఉంటాయని పేర్కొన్నారు. ఈ మేరకు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మేడే కార్మిక ఐక్యతకు సంకేతం

ఎర్రుపాలెం: మేడే.. కార్మిక ఐక్యతకు సంకేతమని సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, నియోజక వర్గ ఇన్‌చార్జ్ పాలడుగు భాస్కర్ అన్నారు. మండలంలోని మీనవోలు గ్రామంలో జరిగిన మేడే వారోత్సవాలకు హాజరయ్యారు. తొలుత మధిర సమితి అధ్యక్షు రామిశెట్టి పుల్లయ్య, మాజీ సర్పంచ్ మన్నె జానకి రామయ్యల విగ్రహాలకు నివాళి అర్పించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మేడే స్ఫూర్తికి తూట్లు పొడుస్తుందని, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందన్నారు. బోడేపూడి వారసత్వాన్ని నిలబెట్టేందుకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మధిర నియోజవర్గంలో సీపీఎం పోటీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వీరయ్య, నాయకులు నాగుల్ మీరా, సంజీవరావు, వెంకట్రామయ్య, రేణుక, పుల్లయ్య, మొహిద్దీన్, కృష్ణ, మౌలాలి, రాంబాబు, అంకాలరావు, జయరాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కనిపించడం లేదని ఫిర్యాదు

సత్తుపల్లి: సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆచూకీ తెలియడం లేదని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్, ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కౌన్సిల్ సెక్రటరీ రావి నాగేశ్వరరావు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులు కన్నీరుమున్నీరవుతుండగా, ఎమ్మెల్యే మాత్రం అందుబాటులో లేరని పేర్కొన్నారు. నాయకులు దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఐ.కృష్ణ, ఫజల్ బాబా, కాంతారావు, బాజీ, ఏడుకొండలు, ప్రసాద్, పాషా పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల చిట్టా బయటపెట్టాలి


తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సత్తుపల్లిటౌన్: దళితబంధు పథకం అమలులో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యే చిట్టా బయటపెట్టాలని బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఎం.చిన్నికృష్ణ కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో దళితుల అభ్యున్నతి కోసం దళితబంధు పథకం ప్రవేశపెట్టామని ప్రగల్భాలు పలుకుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అవినీతికి అడ్డాగా మార్చుకుందని ఆరోపించారు. దళితులపై నిజంగా ప్రభుత్వానికి ప్రేమ ఉంటే అవినీతి ఎమ్మెల్యేలను వెంటనే బర్తరఫ్ చేయాలన్నారు. అధికారం ఉందికదా అని అక్రమాలకు పాల్పడడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు పాలకొల్లు శ్రీనివాసరావు, ఆచంట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు..

సత్తుపల్లిరూరల్: ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దళిత బంధు పథకంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యే అవినీతిని వ్యతిరేకిస్తూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరహారదీక్షలు బుధవారం రెండో రోజుకు చేరాయి. ఈ కార్యక్రమంలో కొలికపోగు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, పరిగడుపు లక్ష్మణ్, తాళ్ల అర్జున్, మరియమ్మ, సుగుణమ్మ, లేయమ్మ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

'కొంగర' జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి


మాట్లాడుతున్న బాగం హేమంతరావు

బోనకల్: సీపీఐ సీనియర్ నాయకుడు కొంగర అప్పయ్య జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో బుధవారం కొంగర అప్పయ్య 25వ వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా శ్రేయస్సు కోసం పోరాడి వ్యక్తి కొంగర అయ్యప్ప అని అన్నారు. బ్రాహ్మనపల్లి గ్రామాన్ని నిర్మించడంతో ఆయన పాత్ర కీలకమన్నారు. ఆయన స్తూపం వద్ద సీపీఐ జెండాను ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు జమ్ముల జితేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మందడపు రాణి, బెజవాడ రవిబాబు, మండల కార్యదర్శి యంగల ఆనందరావు, గుడిద కృష్ణ, కొంగర రామారావు, తూము రోషన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించాలి


మురళి స్మారక స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

కొణిజర్ల: దేశాన్ని పరిపాలిస్తున్న మతోన్మాద బీజేపీని ఓడించడమే కమ్యూనిస్టు పార్టీల లక్ష్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీపురంలో చింతపల్లి ప్రసాద్ అధ్యక్షతన సీపీఎం సీనియర్ నాయకుడు గోంగూర మురళి ద్వితీయ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో బీజేపీని గద్దె దించాలన్నారు. కమ్యూనిస్టులు అన్ని వర్గాల ప్రజల హక్కుల కోసం పోరాడుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు కుటుంబరావు, హరిచంద్, రవికుమార్, సత్యనారాయణ, నంద్యానాయక్, నరసింహారావు, కనకయ్య, వెంకటేశ్వర్లు, రామయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం చేయాలి


వ్యాయామం చేస్తున్న అధికారులు

ముదిగొండ: ముదిగొండ మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజాప్రతినిధులు, ఉద్యోగులకు హైద్రాబాద్ నిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో ఫిజియో థెరపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతతకు వ్యాయామం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ సామినేని హరిప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపులేటి దుర్గ, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' దేశానికే ఆదర్శం


'కంటి వెలుగు'ను ప్రారంభిస్తున్న సర్పంచ్ విద్యాసాగర్‌రావు

తల్లాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శమని సర్పంచ్ కొమ్మినేని విద్యా సాగర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని రేజర్లలో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అవసమైన వారికి కళ్ల అద్దాలను, ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొమ్మినేని ప్రభాకర్ రావు, డాక్టర్ శ్రీకాంత్, పీహెచ్ఎన్ రాజేశ్వరీ, ఉప సర్పంచ్ కృష్ణయ్య పాల్గొన్నారు.

వైద్య బృందానికి సన్మానం..

వైరారూరల్: మండలంలోని వల్లాపురం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కంటి వైద్య బృందానికి బుధవారం గ్రామస్తులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అంతకు ముందు కంటి వెలుగులో భాగంగా వైద్యులు ఇంటింటికీ తిరిగి కంటి వైద్య పరీక్షలను నిర్వహించి కళ్ల అద్దాలను అందించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ వుంద్రూ శ్యాంబాబు, డాక్టర్ ఉదయలక్ష్మీ, డాక్టర్ బాంధవి, సూపర్‌వైజర్ అనంతరాములు తదితరులు పాల్గొన్నారు.

పదిమందిపై కేసు నమోదు

సత్తుపల్లి: మద్యం సేవించి పోలీసులపై దుర్భాషలాడిన సంఘటనలో సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన పది మంది యువకులు మంగళవారం అర్ధరాత్రి రోడ్డుపై మద్యం సేవిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులపై దుర్భాషలాడారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము తెలిపారు.

అనాథాశ్రమంలో అన్నదానం

మధిర: ఆర్‌కే ఫౌండేషన్ అనాథాశ్రమంలో బుధవారం అన్నదానం చేశారు. దెందుకూరు గ్రామానికి చెందిన దోర్నాల కృష్ణ, రామకోటమ్మ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ మాట్లాడుతూ.. అనాధ ఆశ్రమానికి సహాయ సహకారాలు అందిస్తున్న దోర్నాల కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దోర్నాల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

తల్లాడ: పారిశుద్ధ్య కార్మికులకు మేడే కానుక వెయ్యి రూపాయలతో సరిపెట్టుకోవడం కాదు లీవింగ్ వేతనం అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు డి.శ్రీనువాసరావు అన్నారు. బుధవారం తల్లాడలో జరిగిన ఐఎఫ్‌టీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2021 పీఆర్‌సీ నివేదికలో పారిశుద్ధ్య కార్మికుల వేతనం రూ.19 వేలుగా నిర్ధారించిందనీ, ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే పీఆర్‌సీ జీవో 60 అమలు చేయాలన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కల్లుగీత కార్మికులు

ముదిగొండ: మండలంలోని న్యూలక్ష్మీపురంలో బుధవారం కల్లుగీత కార్మికులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ.. కల్లుగీత కార్మికులకు ప్రమాదబీమా రూ.5 లక్షలు ప్రకటించడం హర్షనీయం అన్నారు. కార్యక్రమంలో గౌడసంఘం ప్రతినిధులు, నాయకులు కుమారస్వామిగౌడ్, హైమావతి, వెంకన్న, ఉపేందర్, వెంకటేష్, పాపారావులు తదితరులు పాల్గొన్నారు.

ఏసు మృతికి సీపీఎం నాయకుల నివాళి

కొణిజర్ల: మండలంలోని చిన్నమునగాలకు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు పాపగంటి ఏసు బుధవారం మృతి చెందాడు. ఆయన మృతి విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావులు మృతదేహాన్ని సందర్శించి మృతదేహంపై పార్టీ పతాకాన్ని కప్పి నివాళులు అర్పించారు. నరసింహారావు, మోహన్‌రావు, వెంకటేష్, శేషయ్య, ప్రభాకర్, ముత్తయ్య, తదితరులు నివాళులు అర్పించారు.

రక్షణ చర్యలతో ప్రమాదాల నివారణ

సత్తుపల్లిటౌన్: ప్రతీ ఒక్కరు విద్యుత్ భద్రతా సూచనలు పాటించటం ద్వారా విద్యుత్ ప్రమాదాల నుంచి రక్షించుకోవచ్చని మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. సత్తుపల్లిలోని విద్యుత్‌శాఖ ఏడీఈ కార్యాలయంలో బుధవారం విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ డి.ప్రసాద్‌బాబు, ఏఈలు యు.శరత్‌బాబు, సుజాత, ఫోర్‌మెన్ రాజు, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ షణ్ముకాచారి, శ్రీనివాసరెడ్డి, లైన్‌ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమావేశం..

ముదిగొండ: ముదిగొండలోని రైతు వేదికలో గురువారం విద్యుత్ వినియోదారుల సమావేశం నిర్వహిస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ మేకపోతుల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, విద్యుత్ సిబ్బంది ప్రమాదాల బారిన పడకుండా ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలని వివరించడం జరుగుతుందని అన్నారు. విద్యుత్ వినియోగదారులు తప్పని సరిగా హాజరు కావాలని ఏఈ శ్రీనివాస్ కోరారు.

బాల్య వివాహాలు నిషేధించాలి


మాట్లాడుతున్న సీడీపీఓ దయామణి

ఏన్కూరు: బాల్య వివాహాలు నిషేధించాలని ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర బాలలపరిరక్షణ పథకంలో భాగంగా బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటిలో 14 మంది సభ్యులు ఉంటారని, చైర్మన్‌గా ఎంపీపీ అరెం వరలక్ష్మి ఉంటారన్నారు. ఈ కమిటీ బాల్యవివాహాలు, బాలకార్మికులు, డ్రాపౌట్స్ విద్యార్థులు, లైంగిక వేదింపులకు గురైన పిల్లలను గుర్తించి వారిని రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్‌కే ఖాసీం, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ప్రభుత్వ వైద్యాధికారి రాములు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధి వినాయక ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం


శంకరాచారిని అభినందిస్తున్న చైర్ పర్సన్ లత

మధిర: మధిర పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ సిద్ధి వినాయక స్వామివారి ఆలయ కమిటీ బాధ్యులు బుధవారం ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక సిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద ఎండోమెంట్ సూపరింటెండెంట్ సమత, ఆలయ ఈఓ రామకోటేశ్వరరావు సమక్షంలో ఆలయ కమిటీ చైర్మన్‌గా బాణాల శంకరాచారి, ధర్మకర్తలుగా వలిశెట్టి శ్రీనివాసరావు, ఆవుల నాగేశ్వరరావు, గండేపల్లి శ్రీనివాసరావు, దోర్నాల చిన్న వెంకటేశ్వర్లు, దోసపాటి రాజ్యలక్ష్మి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, మధిర మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత, ఎంపీపీ లలిత, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు కనుమూరి వెంకటేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొని నూతన కమిటీని అభినందించారు.

ముగిసిన పునీత జోజప్ప దేవాలయ మహోత్సవం


ప్రార్థనలు చేస్తున్న పీఠాధిపతి బాల

కల్లూరు రూరల్: మండలంలోని పెద్దకోరుకొండిలో పునీత జోజప్ప దేవాలయ మహోత్సవం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న మహోత్సవం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఖమ్మం అపోస్తులిక పీఠాధిపతి ఉడుముల బాల పాల్గొని బోధనలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మతగురువులు ప్రావిన్షియల్, జోజి, జోజిబాబు నరేష్, ఏపీ,తెలంగాణ మత గురువులు, చెన్నూరు, ఎర్రబోయినపల్లి, వెంకటాపురం తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి

జేపీఎస్‌ల దీక్షకు ఎమ్మెల్సీ సంఘీభావం ..


మధిర: కార్యదర్శులకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి


కారేపల్లి: సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్న కాంగ్రెస్ నాయకురాలు మంజుల

మధిర: జేపీఎస్‌లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అనానరు. మధిర మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలీతో పాటు అనుమోలు కోటేశ్వరరావు, తాళ్లూరి ఆంజనేయులు, మీరా ఖాన్, తలుపుల సాంబయ్య, ఆశీర్వాదం, శ్రీనివాసరావు, వినోదరావు, రామకృష్ణ, వీరయ్య, లాల్ అహ్మద్, ఇబ్రహీం, కొండలరావు, సాధు సమాధానం, భాస్కరరావు, చిన్ని పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: సమ్మెకు సీఐటీయూ కొలికపోగు సర్వేశ్వరరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జేపీఎస్‌లు బి.వాసు, సీహెచ్ నిరోషా, జి.స్వామి, ఎం.శివసాయి, కె.మాధురి, కె.సురేష్, జి.మహేష్,ఎం.ఉపేంద్ర, పి.దినేష్‌కుమార్, వై.రవితేజ, పి.భార్గవ్ పాల్గొన్నారు.

చింతకాని: జేపీఎస్‌ల సమ్మెకు చింతకాని మెడికల్ అండ్ హెల్త్ మద్దతు ప్రకటించాయి. ఏఐటీయూసీ జిల్లా నాయకుడు తోట రామాంజనేయులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రవి, గోపాలరావు, సీతరామిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణారావు, శ్రీనివాస్, రత్నకుమారి తదితరులు ఉన్నారు.

కల్లూరు రూరల్: జేపీఎస్‌లు నిరసనగా మండల పరిషత్ కార్యాలయం రోడ్లను శుభ్రం చేశారు.

ఎర్రుపాలెం: జేపీఎస్‌ల సమ్మె బుధవారం ఆరో రోజుకు చేరుకుంది. సమ్మె చేస్తున్న వారిలో కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు రాము, మండల ప్రధాన కార్యదర్శి వరికూటి సురేష్, రాజ్యలక్ష్మి, నాగిని, నర్సింహా, హారతి, ఎం.శ్రీనివాసరావు, రామకృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

కారేపల్లి: జేపీఎస్‌ల సమ్మెకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల సంఘీభావం తెలిపారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ చంద్రన్న వర్గం సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మద్దతు తెలిపిన వారిలో సీపీఐ ఎంఎల్ న్యూడెక్రసీ చంద్రన్న వర్గం మండల కార్యదర్శి తేజ్యానాయక్, కాంగ్రెస్ నాయకులు భద్రునాయక్, శ్రీనివాసరావు, తారాచంద్ పాల్గొన్నారు.

బోనకల్: జేపీఎస్‌ల సమ్మెకు సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గిరి సంఘీభావం తెలిపారు.